క్లుప్తంగా

నేడు మంత్రి పువ్వాడ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మంగళవారం ఖమ్మంలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు నయాబజార్ స్కూల్‌లో ఇటీవల వరదలతో ఆస్తి నష్టపోయిన బాధితులకు సాయం అందజేయనున్నారు. 11 గంటలకు సర్దార్ పటేల్ స్టేడియంలో జాతీయ క్రీడల దినోత్సవంలో పాల్గొననున్నారు. సాయంత్రం సీసీ డ్రైన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన, క్యాంపు కార్యాలయంలో పువ్వాడ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డ్రైవింగ్ లెర్నింగ్ లైసెన్స్ మేళాలో ఎల్ఎల్ఆర్ పత్రాలను పంపిణీ చేయనున్నారు.

బకాయిలపై అధికారులు సీరియస్

సాక్షి ఎఫెక్ట్..

నేలకొండపల్లి: మండలంలోని ప్రభుత్వ, ప్రవేట్ సంస్థల్లో విద్యుత్ బకాయిలు పేరుకపోతున్నాయి. 'బకాయిలు బరువాయే' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనంతో అధికారులు కది లారు. సోమవారం మండల కేంద్రంలో దాడులు నిర్వహించారు. మండలంలో విద్యుత్ బకాయిలు రూ.లక్షల్లో ఉండటంతో సోమవారం ఒక్కరోజే 15 కార్యాలయాలకు వెళ్లి నోటీసులు ఇచ్చారు. అందులో దక్షిణ భారత దేశంలో కెల్లా అతిపెద్దదైన బౌద్ధక్షేత్రం దాదాపు రూ.6 లక్షల బకాయి ఉంది. స్థానిక తహసీల్ రూ.3 లక్షలు, వ్యవసాయ మార్కెట్ కార్యాలయం రూ.40 వేల బకాయిలు ఉన్నాయి. సంబంధిత అధికారులు కార్యాలయాలకు వెళ్లి నోటీసులు ఇచ్చినట్లు, అంతే కాకుండా మూడు రోజుల్లో చెల్లించకపోతే కనెక్షన్‌ను తొలగిస్తామని ఏఈ కె.రామారావు తెలిపారు. కాగా ప్రభుత్వ పాఠశాల ఇటీవల రూ.3 వేల బకాయిలు చెల్లించగా ఇంకా రూ.10 వేల బకాయి ఉండటంతో కనెక్షన్‌ను తొలగించారు. రూ.లక్షల రూపాయల బకాయిలు ఉన్న కార్యాలయాలను వదిలేసి పాఠశాల కనెక్షన్ తొలగించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

వనసేవకుడి ఎంపికలో వివాదం

నేలకొండపల్లి: మండలంలోని బైరవునిపల్లి గ్రామపంచాయతీ నర్సరీలో వన సేవకుడి నియామకానికి ఏర్పాటుచేసిన సమావేశం అర్ధంతరంగా ముగిసింది. సర్పంచ్ గురవమ్మ అధ్యక్షతన సోమవారం సమావేశం ఏర్పాటుచేయగా, గతంలో నియమించిన వ్యక్తికే మళ్లీ ఇవ్వాలని తీర్మానం చేసేందుకు సిద్ధమయ్యారు. ఇంతలోనే మరో వర్గం వచ్చి నాలుగేళ్లగా ఒకే వ్యక్తికి ఇవ్వడం సరికాదని, కొత్త వారికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. దీంతో ఇరువర్గాల వాదోపవాదాలతో వివాదం పెరగడంతో సమావేశాన్ని వాయిదా వేశారు.

తహసీల్దార్‌కు వినతి

తిరుమలాయపాలెం: మండలంలో అర్హులైన దళితులకు దళితబంధు, గృహలక్ష్మి ఇళ్లు ఇవ్వాలని కోరుతూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ రాంప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను మాట్లాడుతూ... మండలంలోని 58 దళిత కాలనీల్లో సుమారు ఆరువేల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, ఎలాంటి భూములు లేక కూలీ నాలి చేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. పి.సత్యనారాయణ, సురేష్, రమేష్, మల్లయ్య, వీరన్న పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఖమ్మంరూరల్: రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన ఘటన మండలంలోని ఏదులాపురం శివారు కోహీ దాబా వద్ద సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ వైపు నుంచి వస్తున్న కారు ఖమ్మం నుంచి తిరుమలాయపాలెం వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా ఢీ కొట్టింది. దీంతో ఆ బైక్ ఎగిరి మరో బైక్‌పె పడటంతో రెండు ద్విచక్రవాహనాలపై ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	38	బచ్చలికూర	5
వంకాయ	36		20
బెండకాయ	26	పాలకూర	4
పచ్చిమిర్చి	50		20
కాకర	38	చుక్కకూర	4
బీర	36		20
దొండ	36	తోటకూర	5
పొట్లకాయ	30		20
చిక్కుడు	60	గోంగూర	4
గోరుచిక్కుడు	36		20
క్యాబేజీ	20	మెంతికూర	4
క్యాలీఫ్లవర్	40		20
ఆలుగడ్డ	24	కొత్తిమీర	1
చామగడ్డ	36		30
క్యారెట్	40	పుదీన	1
క్యాప్సికం	40		20

-ఖమ్మం వ్యవసాయం

గిరాఖీ షురూ..



- రాఖీ కట్టేందుకు అక్కాచెల్లెళ్ల సన్నద్ధం
- కొనుగోళ్లలో సోదరీమణుల నిమగ్నం

ఖమ్మంగాంధీచౌక్: రాఖీ సందడి ప్రారంభమైంది. అన్నదమ్ములకు రాఖీలను కట్టేందుకు అక్కాచెల్లెల్లు ఆరాటపడుతున్నారు. రాఖీ వేడుకలను జరుపుకునేందుకు అక్కచెల్లెళ్ల హడావుడి చేస్తున్నారు. శ్రావణ పౌర్ణమి రోజున జరుపుకునే పండుగ రాఖీ పండుగ. అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలకు సూచికగా రాఖీ పండుగను జరుపుకుంటారు. ఎక్కడ చూసినా రాఖీల విక్రయాలు జరుగుతున్నాయి. శ్రావణ పౌర్ణమి బుధవారం మొదలు గురువారం వరకు ఉంది. దీంతో కొందరు బుధవారమని, కొందరు గురువారం రాఖీ పండుగ అని చెప్పుకుంటున్నారు. అయితే అంతా బుధవారం రాఖీ పౌర్ణమి వేడుకలను జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు. కొందరు పండితులు మాత్రం గురువారం రాఖీ పౌర్ణమి అని స్పష్టంగా చెబుతున్నారు.

జోరుగా విక్రయాలు..

రకాలను బట్టి ధర నిర్ణయించి విక్రయిస్తున్నారు. రూ.10లు మొదలు రకాలను బట్టి రూ.100 నుంచి రూ. 400ల వరకు కూడా రాఖీల ధరలున్నాయి. అంతేగాక కొందరు ఆర్థికంగా ఉన్నతంగా ఉన్న వారు వెండి, బంగారంతో కూడిన రాఖీలను కూడా



రాఖీలు కొనుగోలు చేస్తున్న యువతులు

ప్రత్యేకంగా తమ సోదరులకు కడుతుంటారు. రాఖీ స్టాల్స్‌ను ప్రత్యేకంగా దుకాణాల వారు, ఫ్యాన్సీ షాపుల వారు ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. భిన్నమైన రాఖీలు అందుబాటులోకి వచ్చాయి. వివిధ స్టోన్లతో చేసిన ఖరీదైన రాఖీలు కూడా విక్రయిస్తున్నారు. రాఖీతో పాటు అలంకరించి ఓ ప్లేటు, పసుపు కుంకుమ భరణిలు, అక్షంతలు ఉంచేందుకు ఓ బాక్స్ వంటి అన్నింటితో కూడిన సెట్‌ను కూడా విక్రయిస్తున్నారు.

స్వీట్లకూ గిరాకే..

రాఖీ కట్టే అక్కచెల్లెల్లు తమ వెంట స్వీట్లను తీసుకెళ్తారు. దీంతో రాఖీలతో పాటు స్వీట్లకు కూడా గిరాకీ పెరిగింది. కొందరు రాఖీలతో పాటు స్వీట్లను విక్రయిస్తున్నారు. అక్కడే కొనుగోలుదారులు రెండు కొంటున్నారు. కొందరు దుకాణాలకు వెళ్లి స్వీట్లను కొనుగోలు చేస్తున్నారు. ఇదే అదునుగా స్వీట్ల దుకాణాల యజమానులు రకాన్ని బట్టి డిమాండ్ ఉన్న రకాలకు ధరలను పెంచి విక్రయిస్తున్నారు.

అనుబంధాలను పంచే రాఖీ



అనుబంధాలను పంచే పండుగ రాఖీ. ఈ పండుగ అంటే ఎక్కడ లేని ఆనందం. ఎక్కడున్నా రాఖీ పండుగ వచ్చిందంటే తప్పనిసరిగాఅన్నయ్యలకు, తమ్ముళ్లకు రాఖీ కడతా. ఇద్దరు అన్నయ్యలు కొత్తగూడెంలో ఉన్నారు. ఇద్దరు తమ్ముళ్లు అమెరికాలో ఉన్నారు. అమెరికాలో ఉన్న వారికి ఇప్పటికే కొరియర్‌లో రాఖీలు పంపించా.

– జింజిరాల విజయశాంత, ప్రశాంతినగర్, ఖానాపురం, ఖమ్మం

ప్రతీ ఏటా జరుపుకుంటాం



రాఖీ పండుగ అంటే ఎంతో ఇష్టం. చిన్నప్పటి నుంచి రాఖీ పండుగ వచ్చిందంటే పది రాఖీలకు పైగా కొనుగోలు చేస్తా. అన్నదమ్ములందరికి కడతా.. రక్షణ బంధమే రాఖీ. అన్నాచెల్లెల్లు, అక్కా తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ. కొత్త దుస్తులు ధరించి రాఖీలు, స్వీట్లు తీసుకొని అన్నదమ్ముల ఇళ్లకు వెళ్లి అందరికి రాఖీలు కట్టివస్తా.

– సంధ్య, మామిళ్లగూడెం, ఖమ్మం

అభిరుచులను బట్టి విక్రయం



రకరకాల రాఖీలు అందుబాటులోకి వచ్చాయి. పిల్లలు మొదలు పెద్దల వయసు వరకు కట్టుకునే రాఖీలు విక్రయిస్తున్నాం. భిన్నమైన రాఖీలను తెప్పించి విక్రయిస్తున్నాం. రూ. 10లు మొదలు రూ. 400ల వరకు కూడా రాఖీలు ఉన్నాయి. అమెరికా వంటి విదేశాలకు పంపించేందుకు కూడా ప్రత్యేకంగా రాఖీలు ఉన్నాయి. రాఖీల కొనుగోళ్లు జోరందుకున్నాయి.

– కుప్పాల కృష్ణ, రాఖీల వ్యాపారి, బస్ డిపో రోడ్డు

పార్టీలో సముచిత స్థానం కల్పిస్తాం..



పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న పొంగులేటి

ఖమ్మంమయూరిసెంటర్: కాంగ్రెస్‌లో చేరిన నాయకులకు, కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామని మాజీ ఎంపీ, తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. టీడీపీలో వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న చల్లా రామకృష్ణ ఆధ్వర్యంలో నగరంలోని పంపింగ్ వెల్ రోడ్డు, రమణగుట్ట, ఖానాపురం, రఘునాథపాలెం మండలాలకు చెందిన సుమారు 150 కుటుంబాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు సమక్షంలో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పొంగులేటి తన క్యాంపు కార్యాలయంలో వీరికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ముందుకు..

నేలకొండపల్లి: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంతో ముందుకు సాగాలని, పార్టీ గెలుపును ఏ శక్తి అడ్డుకోలేదని టీపీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని అనంతనగర్‌లో సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఎస్సీ డిక్లరేషన్‌కు విశేష స్పందన లభిస్తుందని, బీఆర్ఎస్–బీజేపీ ఒక్కటేనని ఖమ్మం సభతో తెలిపోయిందన్నారు. అవినీతి ప్రభుత్వంకు చరమగీతం పాడేందుకు సైనికుల్లా పని చేస్తున్నారన్నారు. పంచాయతీలకు నిధులు ఇవ్వకుండా సర్పంచ్‌లను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ



మాట్లాడుతున్న రాయల నాగేశ్వరరావు

సమావేశంలో సర్పంచ్ పెంటమళ్ల పుల్లమ్మ, కాంగ్రెస్ నాయకులు పుల్లారెడ్డి, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, పాకనాటి కన్నారెడ్డి, యడవల్లి నాగరాజు, పగిడికత్తుల సుదర్శన్, వడ్లమూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



సన్మానిస్తున్న నాయకులు

రఘునాథపాలెం: మండలంలోని వి.వి.పాలెం హైస్కూల్‌లో చదువుకొన్న పూర్వ విద్యార్థి తాళ్లూరి కోటేశ్వరరావు సివిల్ ఎస్సైగా ఎంపికవడంతో సోమవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. అతనితోపాటు తల్లిదండ్రులు తాళ్లూరి భిక్షం, వెంకటరమణను సైతం సన్మానించారు. బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు తోలుపునూరి దానయ్య, కూరాకుల సత్యం, ఎంపీటీసీ యరగర్ల హనుమంతరావు, రావెళ్ల సురేష్, తగరం నాగరాజు, కిలారి రమణ, జల్లి ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

పోరాడేది కమ్యూనిస్టులే..

తిరుమలాయపాలెం: ప్రజా సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టు పార్టీలే నని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్ అన్నారు. సోమవారం తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని గజ్జల వెంకటయ్య భవన్‌లో జరిగిన మండల స్థాయి సమావేశంలో మాట్లాడారు. ఎర్రా శ్రీనివాసరావు, షేక్ బషీరుద్దీన్ మండల కార్యదర్శి శ్రీను, నాగేశ్వరరావు, వీరన్న, సురేష్, కొత్తపల్లి వెంకన్న, బింగి రమేష్, మంగపతి, ఇమాం, వెంకటేష్, నిర్మల్ రావు, ప్రసాద్, యశోద, పుష్పమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బండి రమేష్

'భగీరథ' ఎస్ఈ కార్యాలయం ముట్టడి

ఖమ్మంఅర్బన్: మిషన్‌భగీరథ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో భాగంగా సోమవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కార్యాలయాన్ని సీఐటీయూ ఆధ్వర్యంలో మిషన్ భగీరథ కార్మికులు ముట్టడించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. లేబర్ యాక్ట్ ప్రకారం కనీస వేతనం ఇవ్వకుండా ఎల్అండ్‌టీ, ఎన్‌సీసీ కంపెనీ యాజమాన్యం ఆర్థిక దోపిడీకి పాల్పడుతుందని అనేకమార్లు అధికారులకు తెలియజేసిన ఎవరు స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి అధికారులు కంపెనీ యాజమాన్యంతో చర్చలు జరిపి కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమం



ధర్నా చేస్తున్న కార్మికులు

లో అధ్యక్షులు అన్నం వెంకయ్య, కార్యదర్శి పాపగంటి రాంబాబు, అనుబోతు బాలకృష్ణ , పల్లా మధుసూదన్ రెడ్డి, జక్కుల యాదగిరి, గోర్ల నరసింహారావు, పర్వతగిరి రాధాకృష్ణ, నాగమల్లేశ్వరరావు, అబ్బూరి రవి, నవీన్, సురేష్, పరస శీను, బాలాజీ, సోమయ్య, ఉపేందర్, రామకృష్ణ , పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: తమ సంఘంలోని సభ్యులందరికి ఎలాంటి ఆపద వచ్చినా యూనియన్ అండగా ఉంటుందని టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ అన్నారు. తెలంగాణ వీడియో జర్నలిస్టు అసోసియేషన్(టీవీజేఎఫ్) సభ్యులు, వీడియో జర్నలిస్టు అర్షద్ అనారోగ్యంతో బాధపడుతుండగా 10వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి, నాయకులు వెన్నబోయిన సాంబశివరావు, సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు, ప్రధాన కార్యదర్శి శెట్టి రజనీకాంత్, నాయకులు ఫయాజ్, పృథ్వీ, యూసుఫ్, కల్లూరి గణేష్, సునీల్ పాల్గొన్నారు.

యూనియన్ కార్యాలయం ప్రారంభం

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 43వ డివిజన్‌లో ఖమ్మం అంబులెన్స్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ కార్యాలయాన్ని సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, కార్పొరేటర్ బీజీ క్లైమెంట్, నాయకులు పాల్వంచ కృష్ణ, యూనియన్ అధ్యక్షుడు చింతల వినయ్, పాలిశెట్టి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు వెడల్పు పెంచాల్సిందే..



ఆందోళనలో పాల్గొన్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కార్పొరేటర్ తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 54వ డివిజన్‌లో సమీకృత వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ ప్రాంతంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు వెడల్పు పెంచాలని కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆందోళనకు దిగారు. ఇక్కడ 30 అడుగుల రోడ్డులో కేవలం 12 అడుగులతో సీసీ వేయడం సరైంది కాదన్నారు. ప్రతిపక్ష పార్టీల కార్పొరేటర్ల డివిజన్లపై వివక్ష చూపిస్తున్నారన్నారు. కాగా, సోమవారం రాత్రి వరకు ఆందోళన కొనసాగగా మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేరుకుని మాట్లాడారు. మహిళా కార్పొరేటర్ ఆరు గంటల పాటు ధర్నా చేసినా స్పందించకపోవడంపై ఆయన మండిపడ్డారు. పాలకులు, అధికారులు ప్రతిపక్ష నేతలపై పట్టింపులేనట్లు వ్యవహరిస్తున్నారని, త్వరలోనే వారికి గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాం

- ఖమ్మం అభివృద్ధికి ఇంకా ఆలోచనలు
- రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్

ఖమ్మంమయూరిసెంటర్: మంత్రి పదవి రూపంలో వచ్చిన అవకాశాన్ని ఈ నాలుగేళ్ల కాలంలో సద్వినియోగం చేసుకుంటూ ఖమ్మంను మహానగరాలకు దీటుగా అభివృద్ధి చేశామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. నగరంలోని 23వ డివిజన్‌లో రూ.90 లక్షలతో నిర్మించనున్న సీసీ డ్రెయిన్ల పనులకు మంత్రి సోమవారం శంకుస్థాపన చేసిన మాట్లాడారు. గత 70 ఏళ్ల చరిత్రలో ఖమ్మం నియోజకవర్గానికి మంత్రి పదవి రాలేదని, సీఎం కేసీఆర్ తొలిసారి తనకు పదవి ఇచ్చారని తెలిపారు. దీంతో భవిష్యత్ తరాలకు అవసరమయ్యేలా ఖమ్మం అభివృద్ధి చేసుకుంటున్నామన్నారు. ఇంకా అనేక ఆలోచనలు ఉన్నాయని, వీటిని అమలు చేయాలంటే తనకు మళ్లీ అవకాశం కల్పించాలన్నారు. అభివృద్ధితో పాటు ప్రజలకు సంక్షేమ పథకాలను అదే స్థాయిలో అందజేస్తున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ, సుడా చైర్మన్లు కూరాకుల నాగభూషణం, విజయ్‌కుమార్, కార్పొరేటర్ షేక్ మక్బూల్, మున్సిపల్ ఈఈ కృష్ణలాల్, డీఈ నవ్యజ్యోతి, స్వరూపరాణి, నాయకులు షకీనా, రమాదేవి పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం మినీ అంగన్‌వాడీ టీచర్లను మెయిన్ అంగన్‌వాడీలుగా గుర్తించడంతో పాటు ఉద్యోగ విరమణ వయస్సును 65 ఏళ్లకు పెంచడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వీడీవోస్ కాలనీలోని మంత్రి పువ్వాడ



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు, పక్కన మంత్రి

అజయ్‌కుమార్ క్యాంపు కార్యాలయంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల వ్యవస్థను బలోపేతం చేసిందని తెలిపారు. మేయర్ పునుకొల్లు నీరజ, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అఫ్జల్‌హసన్, నాయకులు పాషా, మాటూరి లక్ష్మీనారాయణ, జ్యోతి, షహనాజ్, జ్యోతి, శైలజ, అరుణకుమారి పాల్గొన్నారు.

రవికుమార్‌కు సన్మానం

ఖమ్మంమామిళ్లగూడెం: డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ ప్రజాసంక్షేమ సంఘం ఏర్పడి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షుడు లింగాల రవికుమార్‌ను మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన చేస్తున్న సేవలను అభినందించారు.

పనులు త్వరగా పూర్తిచేయాలి



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి

నేలకొండపల్లి: అభివృద్ధి పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించి త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులను సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. మండలంలోని మోటాపురంలో రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించనున్న పంచాయతీ కార్యాలయం భవన నిర్మాణానికి, మంగ్రాజుపల్లిలో బీటీ రహదారి నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రంథాలయంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీపీ వజ్జా రమ్య, చెరుకు అభివృద్ధి మండలి చైర్మన్ నెల్లూరి లీలాప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ శాంత, ఎంపీడీఓ కె.జమలారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణానికి ఆర్థికసాయం

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురం పరిధి సూర్యనగర్‌లో నిర్మించనున్న ముత్యాలమ్మతల్లి ఆలయానికి ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి సోమవారం రూ. 1.50లక్షల ఆర్థిక సాయం అందించారు. అలాగే, రామన్నపేటలో పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి రూ.3లక్షలు అందజేసి శివాలయం శంకుస్థాపన పూజకు హాజరయ్యారు. బీఆర్ఎస్ మండలధ్యక్షుడు బెల్లం. వేణు, లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు. కాగా, రామన్నపేటలో శివాలయం శంకుస్థాపన భూమి పూజలో వైఎస్సార్ టీపీ నాయకులు నంద్యాల రవీందర్‌రెడ్డి, తోట చినవెంకటరెడ్డి, బత్తిని యాలాద్రి, ఆడెపు ఆంజనేయులు, శ్రీను, అన్నబత్తుల కృష్ణ కూడా పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

ఖమ్మంమయూరిసెంటర్: గ్రీవెన్స్‌లో ప్రజలు ఇచ్చే దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అధికారులను కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం కేఎంసీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. 34 మంది వివిధ సమస్యలపై దరఖాస్తులు ఇవ్వగా.. వాటిని పరిశీలించిన కమిషనర్ ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఎక్కువగా ఇంటి కొత్త నెంబర్లు, పేర్లు మార్పు చేయాలని, పన్నులు సవరించాలనే వాటిపై ఫిర్యాదులు వస్తున్నాయని, అదే సమస్యతో ఫిర్యాదుదారుడు మరోసారి కార్యాలయానికి రాకుండా



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ ఆదర్శ్ సురభి

పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ మల్లీశ్వరి, ఈఈ కృష్ణాలాల్, ఆర్ఓ జి.శ్రీనివాసరావు, ఆర్ఐలు కె.శ్రీనివాస్, లోకేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని వివరిద్దాం..



మాట్లాడుతున్న రామనాథం

ఖమ్మంఅర్బన్: ఎన్నికలు సమీపిస్తున్న వేళ టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధిని వివరించి ఓట్లు అడగాలని టీడీపీ ఖమ్మం పార్లమెంట్ అధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం కోరారు. సోమవారం పార్టీ జిల్లా కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నందమూరి తారక రామారావు ఫొటోలు 100 రూపాయల నాణెంపై ముద్రించడంపైఆనందం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి వెంకటేశ్వర్లు, రాష్ట్ర సెక్రటరీ కనగాల సాంబశివరావు, నాగండ్ల మురళి, , పార్లమెంటు ఉపాధ్యక్షుడు మల్లాది హనుమంతరావు, కొండబాల కర్ణాకర్, ఆర్ఎం రామయ్య, దోమందల సామేల్, కత్రం స్వామి, కనుకుంట్ల కుమార్, నూక హనుమంతరావు, బడేసాహెబ్, గుత్తా సీతయ్య, కేతినేని హరీష్, వడ్డం విజయ్, మల్లెంపాటి అప్పారావు, రాష్ట్ర మహిళా నాయకురాలు చుండూరు రాజేశ్వరి, ఆర్ ఎం వరలక్ష్మి, ఫోటు సరస్వతి, చలసాని ఝాన్సీ రాణి, మేడేపల్లి రాణి, వివిధ మండల అధ్యక్షులు కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

తిరుమలాయపాలెం: వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం తిరుమలాయపాలెం మండల కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వికలాంగులు కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. చింతిరాల నాగభూషణం, ఏసోబు, రంగయ్య, శ్రీను, ఉపేందర్ లక్ష్మయ్య, రమేష్ పాల్గొన్నారు.

ఆందోళన ఉధృతం చేస్తాం..

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేసి, తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ తమ ఆందోళనను ఉధృతం చేస్తామని రెండో ఏఎన్ఎంలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక ధర్నాలో భాగంగా సోమవారం సంఘ నాయకులతో కలిసి ఐడీవోసీ వద్ద రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. తమను రెగ్యులర్ చేసి, సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన కొనాగిస్తామన్నారు. అనేక ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న తమకు శ్రమకు తగిన వేతనం ఇవ్వడం లేదన్నారు. రోడ్డుపై బైఠాయించిన ఏఐటీయూసీ నాయకులను, రెండవ ఏఎన్ఎంలను పోలీసులు అదుపులోకి తీసుకొని రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకునే సమయంలో కొంత ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రావి శివరామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు గాదె లక్ష్మీనారాయణ, రెండో ఏఎన్ఎం సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు వనజ, నాయకులు నాగమణి, సునీత, ధనలక్ష్మి, నరసమ్మ, శైలజ, కృష్ణవేణి, రాజ్యలక్ష్మి, హేమలత, విజయమ్మ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న రెండో ఏఎన్ఎంలు